



కొత్తపల్లి నుంచి కొత్తకొండకు వస్తున్న రథాలు

కోరమీసాల స్వామికి కోటి మొక్కులు

7లో..

- భక్తజన జాతరగా మారిన కొత్తకొండ
- మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



బల్మూరి వెంకట్‌ను వరించిన ఎమ్మెల్సీ

ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎమ్మెల్సీ పదవి మళ్లీ జిల్లాకే దక్కింది. హుజూరాబాద్ శాసనసభ్యుడిగా గెలుపొందిన పాడి కౌశిక్‌రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానం మళ్లీ ఇక్కడి వారితోనే భర్తీ అయింది. హుజూరాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలైన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ పదవి దాదాపు ఖరారైనట్లు తెలిసింది. బల్మూరి వెంకట్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు హుజురాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇప్పుడు ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కడంతో మళ్లీ హుజూరాబాద్‌కు, ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం లభించినట్లయింది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లికి చెందిన వెంకట్‌ను పార్టీ అధిష్ఠానం 2021లో జరిగిన హుజురాబాద్ ఉప ఎన్నికలో పోటీలో నిలిపింది. ఉప ఎన్నికకు ముందు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరడంతో అక్కడ పార్టీకి సరైన అభ్యర్థి లేకుండా పోయారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బల్మూరి వెంకట్‌ను పోటీకి నిలిపింది. ఉప ఎన్నిక తర్వాత కూడా మళ్లీ టికెట్ ఇస్తామని ఆ సమయంలో ఆయనకు హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వకుండా వొడితెల ప్రణవ్‌కు అవకాశం కల్పించారు. హైదరాబాద్‌లోని ఏదైనా స్థానం నుంచి పోటీ చేయాలని వెంకట్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పార్టీ నాయకత్వం ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన రెండు స్థానాల్లో ఒకదాన్ని వెంకట్‌కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుని ఎమ్మెల్యే ఎన్నికల్లో ఆయనకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసినట్లయింది.

● విద్యార్థుల సమస్యలపై ఉద్యమించి

ఎంబీబీఎస్ పూర్తి చేసిన వెంకట్ విద్యార్థుల సమస్యలపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా టీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకేజీలపై తీవ్రస్థాయిలో ఉద్యమించారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో ఆయన రాహుల్ గాంధీ చేపట్టిన జోడోయాత్రలో పాల్గొన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు టీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేక కార్యక్రమాలను చేపడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేశారు.

● ఎమ్మెల్యేల కోటాలో అవకాశం

తెలంగాణ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ రెండు స్థానాలకు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ పార్టీ పోటీకి నిలుపుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వారిద్దరికి ఫోన్ చేసి నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించింది. తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు జనవరి 4న నోటిఫికేషన్ జారీ అయింది. ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 19న నామినేషన్ల పరిశీలన, 22వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. జనవరి 29న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు.

వరుసగా రెండోసారి.. హుజూరాబాద్‌కే ఎమ్మెల్సీ

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గానికే మళ్లీ ఎమ్మెల్సీ పదవి దక్కింది. బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. గతంలో పాడి కౌశిక్‌రెడ్డికి హుజూరాబాద్ నుంచే ఎమ్మెల్సీగా అవకాశం లభించింది. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేసిన బల్మూరి వెంకట్‌కు ఆ పార్టీ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన పాడి కౌశిక్‌రెడ్డి అనూహ్య రీతిలో బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్సీ పదవి పొందారు. 2021 ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన బల్మూరి వెంకట్‌కు కూడా ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తున్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి సంకేతాలు వెలువడ్డాయి. ఇక్కడ పోటీ చేసి పరాజయం పొందిన ఇరువురికి ఎమ్మెల్సీ పదవులు వరించడం సెంటిమెంట్‌గా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది

● కాంగ్రెస్ నాయకుల సంబరాలు...

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు హుజూరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం రాత్రి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్, ఎండీ అఫ్జర్, రవి, మధు, విజేందర్, శ్రీనివాస్, అంజయ్య, సంపత్‌కుమార్, రత్నాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కిరణ్‌రెడ్డి, మహిపాల్, మోరియా, అజయ్, వేణు, అక్బర్ పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా సంక్రాంతి

కరీంనగర్ కల్చరల్, జనవరి 16: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడ చూసినా సంక్రాంతి సందడే కన్పించింది. పిండి వంటలతో పాటు ప్రత్యేక విందులు, వినోదాల్లో మునిగి తేలారు. పిల్లలకు భోగి పండ్లు పోయగా మహిళలు, యువతులు, నోములు పంచుకొని వాయినాలు ఇచ్చుకున్నారు. వాడ వాడల వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోగా జనం స్వగ్రామాలకు తరలి వెళ్లడంతో వీధులు బోసిపోయి కన్పించాయి. ఆలయాల్లో ఇంటిల్లి పాది అర్చనలు జరిపించుకున్నారు. రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామాల్లో ప్రజలు వైభవంగా వేడుకలు నిర్వహించుకున్నారు. నగరంలోని రాంపూర్ గిద్దెపెరుమాళ్ల ఆలయంలో అర్చకుడు రామకశంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరుగగా ఈఓ ఎండపెల్లి మారుతి పాల్గొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ పమేలా సత్పతి తన కుమారునికి భోగి పండ్లు పోశారు. సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కుమారునికి భోగి పండ్లు పోస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

● కన్నుల పండువగా కనుమ

మంగళవారం రైతుల ప్రత్యేక పండుగ కనుమను కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో రైతులు పశువులను అలంకరించి పొలాల వద్ద పూజలు చేశారు. పశువులకు పూజలు జరిపి పైరు పంటలను, పిల్లా పాపలను చల్లగా కాపాడుమంటూ వేడుకున్నారు. సంవత్సరమంతా సుఖశాంతులతో సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి మిత్రులు, బంధువులను, పిల్లలను ఆహ్వానించి వేడుక జరిపారు. మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నోములు పంచుతూ, స్వీకరిస్తూ సందడిగా గడిపారు.



పాతబజార్ గౌరీశంకరాలయంలో ప్రత్యేక అలంకారం

చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

తిమ్మాపూర్, జనవరి 16: చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవద్దని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ తెలిపారు. మంగళవారం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామకృష్ణకాలనీ, నుస్తులాపూర్, ఇందిరానగర్, పోరండ్ల గ్రామాల్లో సిమెంట్ బ్రిక్స్, ఇటుక బట్టీలు, ఇతర ప్రదేశాలను ఆపరేషన్ స్మైల్ టీం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా అక్కడ పిల్లలు పని చేస్తున్నారా అని ఆరా తీశారు. వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. బాల కార్మిక చట్టాల గురించి వారికి అవగాహన కల్పించారు. 14 సంవత్సరాలు నిండని పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆపరేషన్ స్మైల్ ఇన్‌చార్జి ఎస్ఐ అన్వర్, టీం సభ్యులు రమేష్, స్వప్న, సరళ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



యాజమానులతో మాట్లాడుతున్న ఆపరేషన్ స్మైల్ టీం సభ్యులు

బల్దియాలో అక్రమ పోస్టింగ్‌లపై చర్య తీసుకోండి

● సీడీఎంఏకు ఫిర్యాదు

కరీంనగర్ టౌన్, జనవరి 16: నగరపాలక సంస్థ అధికారులు నిరుద్యోగ యువత నుంచి డబ్బులు దండుకొని అక్రమ పోస్టింగులు ఇచ్చారని వాటిపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కమల్‌జీత్‌కౌర్ భర్త సోహెన్‌సింగ్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడీఎంఏ, కలెక్టర్ అనుమతి లేకుండానే కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌లో 18 మంది పేద నిరుద్యోగుల నుంచి రెండు లక్షల చొప్పున తీసుకొని ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇచ్చారన్నారు. వారికి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి జీతాలు ఇస్తున్నారని, ఇలా ఇవ్వడం చట్ట విరుద్ధమని సోహెన్‌సింగ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ పోస్టింగ్‌లపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్ 16: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సుజలాపూర్‌లో ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. మహబూబ్ నగర్‌లో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన రామడుగు మండల కేంద్రానికి చెందిన జిట్టబోయిన సుదేష్ణ, గుళ్ళకోటకు చెందిన మడ్డి వంశీ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రెడ్డవేని మధు, జిట్టబోయిన శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పోతన శ్రీనివాస్, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ వి నరేందర్‌రెడ్డి, సంఘ సభ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టిపల్లి అశోక్, జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్‌రెడ్డి అభినందించారు.



జిట్టబోయిన సుదేష్ణ



మడ్డి వంశీ

● రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు..

మానకొండూర్: మండలంలోని వివిధ పాఠశాలలకు ఆరుగురు క్రీడాకారులు సాఫ్ట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన రాంచరణ్, హర్షవర్ధన్, వేగురుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన వినయ్, నందిని, ఊటూర్ ఉన్నత పాఠశాలకు చెందిన మహీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌నగర్‌లోని కస్తూర్భాగాంధీ విద్యాలయానికి చెందిన రమాదేవి, ఇల్లంతకుంటలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన డి శ్రీహర్షిణి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జనవరి 16: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ నిర్వహిస్తున్న టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాల కు దరఖా స్తులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ కె శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. ఇంటర్మీడి యట్‌తోపాటు ఐఐటీ-జేఈఈ, నీట్, సీఎంఏ, సీఎల్ఏటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు 200 రూపాయల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కరీంనగర్ బస్‌స్టేషన్ పరిశీలన

భగత్‌నగర్, జనవరి 16: కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను సోమవారం కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్‌సుచరిత పరిశీలించారు. ఆయా రూట్లలో ప్రయా ణికుల రద్దీని పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రజనీకృష్ణ, కరీంనగర్-2 డిపో మేనేజర్ మల్లయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు జీఎల్ నారాయణ, ఎం అంజిరెడ్డి పాల్గొన్నారు.



బస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం సుచరిత

కులమతాలతో బీజేపీ రాజకీయం

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు

మానకొండూర్, జనవరి 16: దేశంలో కులమతాలతో బీజేపీ రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు. మానకొండూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అయోధ్య రామాలయం పేరుతో బీజేపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బాబ్రీ మసీదు గొడవలో కేసుల పాలై జైలు జీవితం గడిపిన కరసేవకులను ఆ పార్టీ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వాన్ని కూలగొట్టేంత నీచ రాజకీయం బీఆర్ఎస్ చేయదని, దేశంలోని పలు రాష్ట్రాల్లోని కూల్చింది బీజేపీనేనని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల హామీల అమలుపై మాట్లాడాల్సిన బండి సంజయ్ కేసీఆర్‌పై నిందలు వేయం సరైంది కాదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ చీకటి రాజకీయాలు చేస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలలో వినోద్‌కుమార్ విజయం సాధిస్తాడని ఆయన అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఎ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ యాదగిరి, నాయకులు ఉండింటి శ్యాంసన్, పిట్టల మధు పాల్గొన్నారు.



మానకొండూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

తోటి మహిళలతో కోలాటం ఆడుతూ..



అడుగులు తడబడి..



నేలవాలి..



కుప్పకూలింది..



మహిళలతో కోలాటం ఆడుతూ రాజమణి ఇలా కుప్పకూలింది


ఉత్సాహంగా కోలాటమాడి.. అంతలోనే కుప్పకూలి..

● గుండెపోటుతో మహిళ మృతి

శంకరపట్నం, జనవరి 16: భోగి సందర్భంగా మహిళలందరూ ఒక్కచోట చేరారు. జట్లుగా మారి కోలాటం ఆడడం ప్రారంభించారు. ఉత్సాహంగా ఆడుతున్న వారిలో ఓ మహిళ హఠాత్తుగా కుప్పకూలింది. అక్కడున్న వారు ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. ఈ విషాద సంఘటన శంకరపట్నం మండలం కల్వల గ్రామంలో జరిగింది. కల్వలకు చెందిన రాజమణి (40) అనే మహిళ వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆదివారం భోగి సందర్భంగా గ్రామ కూడలిలో మహిళలందరూ కోలాటం ఆడడం ప్రారంభించారు. రాజమణి అక్కడికి వచ్చి వారితో కలిసి ఉత్సాహంగా కోలాటం ఆడింది. కాసేపటికి ఒక్కసారిగా కుప్పకూలింది. అక్కడున్న వారు ఆమెను వెంటనే జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు రాజమణి అప్పటికే మృతి చెందిందని తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వీడియోను గ్రామస్థులు మంగళవారం సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రాజమణికి భర్త, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.



రాజమణి(ఫైల్)







రైలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, జనవరి 16: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం రైలు పట్టాలు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని జనగాం రాజు(40) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాజు ఎడమ కాలు మోకాలు కింది వరకు తెగి వేరుగా పడింది. మరో కాలు పాదానికి గాయాలయ్యాయి. కరీంనగర్ 108 సిబ్బంది శంకరయ్య, సంపత్‌లు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడని, అతని ఎడమకాలు తొలగించారని కరీంనగర్ రైల్వే ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బావ్‌పేట్‌కు చెందిన జనగాం రాజు కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటున్నాడు.

33 ఏళ్లలో 84 దొంగతనాలు

● గోదావరిఖని పోలీసులకు చిక్కిన నిందితుడు

కోల్‌సిటీ, జనవరి 16: అంతర్ జిల్లా గజదొంగ షేక్ సలీం అలియాస్ ఉస్మాన్ అలియాస్ అస్లాం అలియాస్ జగన్(52)ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 25తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ప్రమోద్‌రావు పేర్కొ న్నారు. అంతర్ జిల్లాల్లో చోరీల్లో ఆరితేరిన సలీం దొంగతనాల చరిత్ర 33ఏళ్ల నుంచి కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలం గాణ జిల్లాలు ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అతడు చోరీలకు పాల్పడ్డాడు. పోలీస్ రికార్డుల్లోనే 84చోరీలపై కేసులు నమోదు అయ్యాయి. వరంగల్, చర్లపల్లి, చంచల్‌గూడ, నిజామా బాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జైళ్లలో సలీం అలియాస్ ఉస్మాన్ జైలు జీవితం గడిపాడు. ఇతనిపై గతంలో పీడీ యాక్టు నమోదు అయినా తీరు మార్చుకోలేదు. జైలులో పరిచయం అయిన నేరస్థులు ఒకరు కోల్ బెల్ట్‌లో సింగరేణి కార్మికులు సంక్రాంతికి స్వస్థలాలకు వెళతారని, ఏ ఇంట్లో చోరీ చేసినా గిట్టుబాటు అవుతుందంటూ సలీంకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడు గోదావరిఖనికి వచ్చి రెక్కీ చేసి గోదావరిఖనిలోకి మార్కండే యకాలనీ, ఎల్‌బీనగర్, రమేష్‌నగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలోల్ చోరీలకు పాల్పడ్డాడు. నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు ఎత్తు కెళ్లాడు. సాంకేతిక ఆధారాలు, దొంగతనం చేసిన తీరు, పోలీసుల ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌తో చోరీలకు పాల్పడింది సలీం అలియాస్ ఉస్మాన్‌గా గుర్తించారు. అతడు జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలం అమ్మక్కపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిని సోమవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడంలో కృషిచేసిన క్రైమ్ టీఎం ఎస్ఐ సమ్మయ్య, ఏఎస్ఐ మల్లయ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, వెంకటేష్‌ను సీఐ ప్రమోద్‌రావు అభినందించారు. అతని నేరాలపై మరింత దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ-2 ప్రసాద్‌రావు, ఎస్ఐ సమ్మయ్య పాల్గొన్నారు.

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి

● 15 ద్విచక్ర వాహనాలు, రూ. 8,500 స్వాధీనం



సాతారం శివారులోని కోళ్ల పందెం స్థావరం

మల్లాపూర్, జనవరి, 16 : మల్లాపూర్ మండలంలోని సాతారం గ్రామ శివారులో గల ఓ మామిడి తోటలోని కోడి పందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో కోడి పందాలను నిర్వహిస్తున్నారని సమచారం మేరకు దాడులు చేయగా ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుం చి 8,500నగదు, ఆరు కోళ్లు, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు కున్నట్లు ఆయన తెలిపారు.

అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందాడు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి ఖనికి చెందిన మహిపాల్‌రెడ్డి(45) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా హైదరా బాద్ నగరానికి వచ్చాడు. లింగంపల్లి చౌరస్తా వద్ద వైన్ షాపులో అతిగా మద్యం తాగి కాచిగూడ చప్పల్‌బజార్ ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఎదుట రోడ్డుపై పడిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకొని చనిపోయాడు. సానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

సైదాపూర్, జనవరి 16: సైదాపూర్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గాజుల లక్ష్మి(70) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి సోమవారం మధ్యాహ్నం తమ వ్యవసాయ బావి వద్దకు పని మీద వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దాంతో కుటంబ సభ్యులు గ్రామంతో పాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా దొరకలేదు. మంగళవారం ఉదయం తమ వ్యవసాయ బావి పక్కన గల రాము లపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మహేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద చెప్పులు కనిపించాయి. దాంతో గ్రామస్థుల సాయంతో ఆ బావిలో పాతాల గరిగె(అంకెన్లు)తో వెతుకగా లక్ష్మి మృతదేహం లభించింది. తన భార్య లక్ష్మి ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మృతి చెందిందని, మృతురాలి భర్త గాజుల మొగిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.

ప్రమాదవశాత్తు అసిస్టెంట్ హెల్పర్ మృతి

కోనరావుపేట, జనవరి 16: ప్రమాదవశాత్తు బావిలో పడి సెస్ కార్యాలయంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్న శ్రీరాముల రాజేశం (55) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన శ్రీరాముల రాజేశం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సెస్‌లో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. 2011లో యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగ్గా ఉండదు. రోజూ కొలనూరు నుంచి వెళ్లి సిరిసిల్ల పట్టణంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో డ్యూటీకి వెళ్తున్నట్లు భార్యకు చెప్పి బయల్దేరాడు. కొలనూరు శివారులోని వ్యవసాయ బావి పక్క నుంచి వెళ్తుండగా రాజేశం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


రాజు (ఫైల్)

సిరిసిల్ల క్రైం, జనవరి 16: సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఓ దుకాణంలో బత్తుల రాజు (38) అనే యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ ఇన్‌చార్జి సీఐ సదన్‌కుమార్ వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలంలోని అవునూరు గ్రామానికి చెందిన రాజు సిరిసిల్లలో సెంట్రింగ్ వర్క్స్ దుకాణం ఏర్పాటు చేశాడు. భవనాలకు సెంట్రింగ్ కాంట్రాక్టు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో సంక్రాంతి పండుగరోజు సోమవారం ఇంటి నుంచి సిరిసిల్లకు వచ్చిన రాజు దుకాణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసు కున్న కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్లకు వచ్చి రాజుకు జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎల్లా రెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సెంట్రింగ్ పనుల్లో నష్టాలు రావడమే కాకుండా అప్పులు పెరిగి మనస్తాపం చెంది తన భర్త రాజు ఆత్మ హత్య చేసుకున్నట్లు అతడి భార్య సింధూర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో వలస కూలీ ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్, జనవరి 16: తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ పార్క్ ఇందిరిమ్మ కాలనీలో నివాసం ఉంటున్న వలస కూలీ చంద్రహాస్ (61) అనారోగ్యంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అజాంఘడ్ ప్రాంతంలోని లాల్‌గంజ్ జిల్లాలోని హరిష్‌పూర్ గ్రామానికి చెందిన అయన జీవనోపాధికోసం ఇక్కడికి వచ్చి ఇందిరమ్మకాలనీలో అద్దెకు ఉంటూ టెక్స్‌టైల్ పార్క్‌లో పని చేస్తున్నాడని తెలిపారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న అయన మంగళవారం అద్దెకు ఉంటున్న ఇంటోనే ఫ్యాక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసున్నాడని ఇంటి యాజమాని కందికొప్పుల స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

భూ తగాదాలో ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

● సోషల్ మీడియాలో పోస్టులు ● ఇద్దరిపై కేసు

పెగడపల్లి, జనవరి 16: పెగడపల్లి మండలం దోమలకుంటలో భూతగాదా విషయంలో ఇద్దరు రైతులు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒకరి తరువాత ఒకరు పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియోలు తీసుకోవడంతో పాటు వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెగడపల్లి ఎస్.ఐ సీహెచ్.సతీష్ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతుండగా ఇద్దరు జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన తొట్ల శేఖర్‌కు విక్రయించాడు. దీనికి సంబంధించి 31 గుంటల భూమి పట్టా కాగా మిగతాది పెండింగ్‌లో ఉంది. ఇలా కొద్ది రోజులు గడవగా తిరిగి తన భూమి తనకు కావాలని శ్రీనివాస్ శేఖర్‌ను కోరాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ చేసుకుని భూమి తిరిగి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గడువు సమయంలో భూమికి సంబంధించిన డబ్బుల చెల్లింపుల విషయంలో గొడవలు తలెత్తగా సోమవారం ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ పురుగుల మందు తాగారు. స్థానికులు ఇద్దరినీ జగిత్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. శ్రీనివాస్, శేఖర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సతీష్ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురి అరెస్ట్

జగిత్యాలరూరల్/రాయికల్ జనవరి 16: రాయికల్ మండలం భూపతిపూర్ శివారులో మంగళవారం గంజాయి రవాణా చేస్తున్న భూపతిపూర్ గ్రామానికి చెందిన ఎండీ దిల్షాద్, కడార్ల మహేష్, పెద్దిరెడ్డిజయంత్, దొనిపాల సాయిభరద్వాజ్ తోపాటు ఒక మైనర్ ఐదుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ తెలిపారు. జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో మంగళ వారం విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం రాయికల్ ఎస్సై అజయ్ తన సిబ్బందితో కలిసి భూపతిరోడ్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా ఐదుగురు అనుమానాస్పదంగా కలిపించారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద నుంచి 4.03 కిలోల విలువ గల గంజాయి, రూ లక్ష 750 రూపాయలతో పాటుగా ఐదుసెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై అజయ్, కానిస్టేబుల్స్ సాగర్, సంతోష్, ప్రశాంత్ లను సీఐ అభినందించారు.

అంగారిక టౌన్ షిప్‌లో చోరీ

- 55చదరపు మీటర్ల అల్యూమినియం కండక్టర్ల అపహరణ

తిమ్మాపూర్, జనవరి16: మండలంలోని రామకృష్ణ కాలనీ అంగారిక టౌన్‌షిప్‌లో విద్యుత్ స్తంభాలపై ఉన్న వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎల్ఎండి ఎస్సై చేరాలు, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఏఈ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అంగారిక టౌన్ షిప్‌లో నూతనంగా విద్యుత్ లైన్లు వేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా వరుసగా సెలవులు రావడంతో పనుల్లో అంతరాయం ఏర్పడింది. ఇదే అదునుగా దొంగలు చోరీకి పాల్పడి 20విద్యుత్ స్తంభాలపై ఉన్న సుమారు 55 చదరపు మీటర్లు(సుమారు450కిలోల) అల్యూమినియం కండక్టర్ల(వైరు) కట్ చేసుకొని ఎత్తుకెళ్లారు. దాని విలువ సుమారు 3లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యుత్ ఏఈ శ్రీధర్ ఎల్ఎండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.

కోర మీసాల స్వామికి కోటి మొక్కులు

● భక్తజన జాతరగా మారిన కొత్తకొండ ● మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది. ఎటు చూసినా క్యూ లైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుని నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపొయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కుమార్, వరంగల్ జిల్లా అధికారులు, ప్రజాప్రతనిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్ రావులు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగాం, నల్గొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు.



దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు, స్వామివారు


మొక్కులు చెల్లించేందుకు వస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

రాష్ట్ర వ్యాప్త గుర్తింపుగా కొత్తకొండ జాతర

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్ర వ్యాప్త గుర్తింపుగా కొత్తకొండ జాతరను నిర్వహిద్దామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం కొత్తకొండ జాతరలో స్వామివారికి గుమ్మడికాయ, కోరమీసాలు చెల్లించి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి కొత్తకొండకు భక్తులు వచ్చే విధంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కొత్తకొండ వీరన్నకు కోరమీసాలు సమర్పిస్తే కోరిన కోరికలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నానన్నారు.

● కొత్తకొండ జాతరలో వృక్ష ప్రసాదాన్ని మాజీ మంత్రి ఈటల రాజేందర్ వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. గత ఏడు సంవత్సరాలుగా కొత్తకొండ జాతరలో జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి మొక్కలు పంపిణీ చేస్తున్నారు.


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం


మేకల రథం


వృక్ష ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈటల రాజేందర్

పీవీ ఇంటి నుంచి జాతరకు రథం

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కుటుంబీకులు గత 9 దశాబ్దాలుగా కొత్తకొండ శ్రీవీరభద్రస్వామికి ఎడ్ల బండి రథం తిరిగే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. పీవీ తనయుడు పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ మదన్‌మోహన్ రావులు సోమవారం ఎడ్లబండి రథాన్ని ప్రారంభించారు. రథాన్ని అందంగా తయారు చేశారు. పీవీ నర్సింహారావు, పీవీ రాజేశ్వర్‌రావులు గతంలో రథం తమ ఇంటి నుంచి నడపడం ఆనవాయితీ. పీవీ చిన్న కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు ఈ ఆనవాయితీ కొనసాగించారు.

సంక్రాంతి పర్వదినాన వేములవాడకు పోటెత్తిన భక్తులు


వేములవాడలో భక్తుల రద్దీ


బద్దిపోచమ్మ ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

వేములవాడ, జనవరి 16 : సంక్రాంతి పర్వదినాన వేములవాడ పుణ్యక్షేత్రం భక్తజనంతో జాతరను తలపించింది. సోమవారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు గత కొద్ది వారాలుగా వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ సోమవారం కలిసి రావడంతో సుమారు 50 వేల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనం కోసం తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా ముందుగా ప్రకటించిన విధంగా గర్భాలయంలో రుద్రాభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిక సేవలను నిలిపివేసి శీఘ్రదర్శనం అమలు చేశారు. అయినప్పటికీ శ్రీ స్వామివారి సర్వ దర్శనం కోసం సుమారు మూడు గంటల సమయం, శీఘ్రదర్శనంకు సుమారు గంటకు పైగా సమయం పట్టింది. మేడారం వెళ్లడానికి ముందు భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకునే ఆనవాయితీ ఉండడంతో కోడె మొక్కుల క్యూ లైన్‌లో భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరారు. ఆలయం నుండి గుడి చెరువు పార్కింగ్ స్థలం వరకు క్యూలైన్లో భక్తులు నిండిపోయారు. దీంతో కోడెమొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుండి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వీఐపీల సిఫారసు లేఖలతో వచ్చిన వారు భక్తుల సమాచార కేంద్రం వద్ద చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా సోమవారం సుమారు 50 వేల మంది భక్తులు శ్రీ స్వామివారి దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో ఏఈఓ బి.శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతి రావు, అల్లి శంకర్, ప్రోటోకాల్ విభాగం పర్య వేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, పరిశీలకులు అశోక్, పవన్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం నాడు తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయంలో నేడు అభిషేక పూజలు రద్దు

వేములవాడ, జనవరి 16: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో 17వ తేదీ బుధవారం గర్భాలయంలో అభిషేక పూజలు రద్దు చేసినట్లు ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో పాటు బుధవారం ఆలయ హుండీ లెక్కింపు చేపట్టనున్న కారణంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తులకు గర్భాలయ ప్రవేశం నిలిపివేశామని, అన్నపూజ టిక్కెట్లను మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల నుంచి జారీ చేస్తామని ఆయన వివరించారు.

రేపు మినీ జాబ్‌మేళా

గణేశ్‌నగర్, జనవరి16: ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు గురువారం ఉదయం 10గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, కరీంనగర్ నందు మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే.దేవేందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పనిచేయుటకు పేటీఎంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, పోస్టుల కోసం విద్యార్హత ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, పూర్తిచేసి ఉండాలన్నారు. 18-35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. వేతనం 15,500 నుంచి 21,000 రూపాయలు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9989152622,9849331903నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

కరీంనగర్ క్రైం, జనవరి 16: కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగిందని స్థానికులు తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక ఇన్వర్టర్, ప్రాథమిక పాఠశాలలో గ్యాస్ సిలిండర్, ఒక సీలింగ్ ఫ్యాన్ ఎత్తుకుపోయారని తెలిపారు.


కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు

మల్యాల, జనవరి 16: కొండగట్టు అంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో వేలాదిగా కొండపైకి భక్తులు తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ది శ్రీనివాస్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్ రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం రద్దీగా మారింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

గాలిపటం ఎగురవేస్తుండగా ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

● విద్యుదాఘాతంతో ఒకరు.. భవనం పైనుంచి పడి మరొకరు

కోరుట్ల, జనవరి 16: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో సోమవారం గాలిపటం ఎగరవేస్తుండగా ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని భీముని దుబ్బ ప్రాంతంలో నివాసం ఉంటున్న పూర్ల దుర్గాప్రసాద్ కుమారుడు ప్రశాంత్ 7వ తరగతి చదువుతున్నాడు. మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన తోకల కిష్టయ్య - నర్సు దంపతుల కుమారుడు సాత్విక్ పట్టణంలోని అమ్మమ్మ జుందర్తి సాంబయ్య - ఎల్లయ్య ఇంట్లో ఉండి ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సందర్భంగా సెలవులు రావడంతో సాత్విక్, ప్రశాంత్ ఇద్దరు కలిసి కాలనీలో ఉన్న ఖాళీ ప్రదేశంలో గాలిపటం ఎగురవేయడానికి వెళ్లారు. గాలిపటం ఎగుర వేస్తుండగా విద్యుత్ వైర్లకు తగిలి వేలాడుతుండటంతో సాత్విక్, ప్రశాంత్‌లు గాలిపటం తీయడానికి అక్కడే ఉన్న ఓ భవనం పైకి ఎక్కి తీసే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతంతో సాత్విక్ తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లి పడిపోయాడు. సాత్విక్ పరిస్థితి చూసి భయపడిన ప్రశాంత్ భవనం నుంచి పరుగు తీసే ప్రయత్నంలో భవనం నుంచి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కాలనీ వాసులు ఇద్దరినీ హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇద్దరిని ఉన్నత చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంఘటన స్థలంను విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ పరిశీలించారు. పట్టణం శివారులోని 133 కేవీ లైన్ నుంచి కల్లూర్ రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కొరకు ఏర్పాటు చేసిన లైన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగినట్లు ఎస్ఈ తెలిపారు. ఇండ్ల సముదాయాల నుండి సరఫరాను మార్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

చెక్‌డ్యాం కూల్చే యత్నం.. అడ్డుకున్న స్థానికులు

పెద్దపల్లి రూరల్, జనవరి 16: మండంలోని హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్ డ్యాంను కూల్చి వేసేందుకు కొంతమంది దుండగులు ప్రత్నించారు. అక్కడి స్థానికులు, రైతులు అడ్డుకోవడంతో సంఘటన స్థలం నుంచి జారుకున్నారు. పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట, కొత్తపల్లి, మూలసాల గ్రామాలను ఆనుకుని ఉన్న హుస్సేన్‌మియా వాగులో సుమారు ఆరేళ్ల క్రితం వంద ఎకరాల పంటలను సాగు చేసుకునేందుకు సుమారు మూడు కోట్ల వ్యయంతో చెక్ డ్యాంను నిర్మించారు. నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు కింది గ్రామాల రైతులకు సాగు నీరు అందుతోంది. అయితే సోమవారం కొంతమంది చెక్‌డ్యాంను కూల్చేందుకు ట్రాక్టర్ సహాయంతో డిటోనేటర్, జిలెటిన్ స్టిక్స్, డ్రిల్ మిషన్‌తో రాగా స్థానికులు గుర్తించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొనేసరికి దుండగులు అక్కడి నుంచి జారుకున్నారు. సంఘటన స్థలం వద్ద చెక్ డ్యాంను కూల్చేందుకు తీసుకొచ్చిన ఒక డ్రిల్లింగ్ మిషన్, 8 డిటోనేటర్లు, 11 జిలెటిన్ స్టిక్స్ లభించాయి. దీంతో రైతులు పోలీసులకు సమాచారం అందించారు. చెక్ డ్యాంను బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, నాయకుడు పల్లె సదానందం, బీఆర్ఎస్ నాయకుడు బాలసాని ఈశ్వర్ గౌడ్ చెక్‌డ్యాంను పరిశీలించారు. ఘటనపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈఈ బుర్ర రాజ్యలక్ష్మీ పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మందుగుండు సామగ్రి లభ్యం..

చెక్ డ్యాంను కూల్చేందుకు వచ్చిన దుండగులు తీసుకొచ్చిన మందుగుండు సామగ్రిని రైతులు పోలీసులకు అప్పగించారు. చెక్ డ్యాంను కూల్చడానికి తీసుకువచ్చిన డ్రిల్ మిషన్, ఎనిమిది డిటోనేటర్లు, 11 జిలెటిన్ స్టిక్స్ లభించాయి. వాటిని పెద్దపల్లి పోలీసులకు అప్పగించారు. సాగు నీరు అందకపోతే అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలి కాని కూల్చే ప్రక్రియ చాలా దారుణమైందని పేర్కొంటున్నారు.


చెక్ డ్యాం కూల్చివేతకు తీసుకొచ్చిన సామగ్రి

ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు పారమిత విద్యార్థిని ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్ 16: జనగామ జిల్లా దేవరుప్పులంచలో ఈనెల 16 నుంచి 18వరకు జరిగే రాష్ట్ర స్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ.కృతికశ్రీ ఎంపికైంది. ఇటీవల రాజన్నసిరిసిల్ల జిల్లా అనుపురంలో నిర్వ హించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన ఆమె రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు బాలాజి తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పారమిత పాఠశాలల డైరెక్టర్లు వినోద్‌రావు, హన్మంతరావు, పీఈటీలు వేణు, అర్జున్, రాజు అభినందించారు.

జాతీయ యువజన ఉత్సవాల్లో జిల్లా వాసులు



ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా యువత

గణేశ్‌నగర్, జనవరి16: 27వ జాతీయ యువజన ఉత్సవాలలో పాల్గొన్న కరీంనగర్ యువతను నాసిక్ సెంట్రల్ ఎమ్మెల్యే దేవయాని ఫరాండే, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఎ.కిరణ్ కుమార్‌తో కలిసి అభినందించారు. మహారాష్ట్ర, నాసిక్‌లో జనవరి 12న స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐదు రోజులపాటు యువజనోత్సవాలను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించింది. మంగళవారం యువజనోత్సవాల ముగింపులో భాగంగా కరీంనగర్ జిల్లా జాతీయ యువజన అవార్డు గ్రహీత కిరణ్ కుమార్ ఆహ్వానం మేరకు స్థానిక నాసిక్ సెంట్రల్ ఎమ్మెల్యే దేవయాని ఫరాండే జిల్లా యువత ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యువతతో కాసేపు ముచ్చటించారు. కరీంనగర్ వంటలు, పర్యాటక, పుణ్యక్షేత్రాల ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో వేములవాడ రాజరాజేశ్వర స్వామిని తాను దర్శించుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత కిరణ్ కుమార్‌తో పాటు త్రిపుర, తెలంగాణ రాష్ట్ర యువజన అవార్డు గ్రహీతలు లిటన్‌షీల్, గంజి రాజేందర్, జిల్లా యువజన ప్రతినిధులు మడ్డి రవిచందర్, ఉప్పు ఆదిత్య, దాసరి సింధూ, సిరి చందన, మాలతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాయజ్ఞవరాహస్వామి కల్యాణం


కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 16: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో మంగళవారం గోదాయజ్ఞవరాహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యూనిటీ కప్-2024 క్రికెట్ లీగ్ ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 16: కరీంనగర్ క్రికెట్‌క్లబ్, సూప క్రికెట్ అకాడమి ఆధ్వర్యంలో యూనిటీ కప్-2024 క్రికెట్ లీగ్ సిజన్ టోర్నమెంట్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం, ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఈపోటీలను అంబేద్కర్ స్టేడియంలో కరీంనగర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిస్‌పాష, కరీంనగర్ అర్బన్ జోన్ పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి అంతటి శంకరయ్య, క్రికెట్ కోచ్ కన్నన్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు పి.యాదగిరి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. విజేతలకు 71వేల రూపాయలు, రన్నరప్‌కు 31వేల రూపాయలు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ క్రికెట్‌క్లబ్ కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్‌క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, అర్చరి సంఘం కార్యదర్శి కె.కృష్ణ, పోటీల నిర్వాహకులు సురేష్, అమన్, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

సైదాపూర్, జనవరి 16: సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అధికారులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, ఎంపీటీసీ కూనమల్ల విజయ మొండయ్య, ఎంపీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శి ఫైమా, సీసీ రమేష్, హెల్త్ సూపర్ వైజర్ సమ్మయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు చిన్నకోమటిపల్లి గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కంకణాల శ్రీలత-సురేందర్‌రెడ్డి, చిట్ల స్వరూప-నాగన్న తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 16 : ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాల సెక్రటరీ వొడితెల సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడు డాక్టర్ వీర్యానాయక్ ఇటరేటివ్ ఇంటర్నేషనల్ పబ్లిషర్స్ తరఫున రచించిన 'టీచింగ్ రీడింగ్ స్కిల్స్ త్రూ కల్చరల్ నరేటివ్స్' అనే పుస్తక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి. రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయాన్ని దర్శించుకున్న సీసీఎల్ఏ అధికారి

గన్నేరువరం, జనవరి 16: మండలంలోని ఖాసింపేట గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీమానసాదేవి మహాక్షేత్రాన్ని సోమవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి నవీన్ మిట్టల్ సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. వీరివెంట వీరివెంట రెవిన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, తహశీల్దారు భిక్షపతి, ఆర్ఐ రజనికుమార్, ఆలయ కమిటీ ఛైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు

హుజూరాబాద్, జనవరి 16: హుజూరాబాద్ పట్టణంలో మకర సంక్రాంతి పండగ సందర్భంగా అయ్యప్పస్వామి ఆభరణాలను ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి దేవాలయం నుంచి ర్యాలీగా పట్టణంలోని పలు వీధుల్లో తిరుగుతూ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నటరాజ్, కుమార్, వెంకట్రావ్, దొరై రాజు, యాదగిరి ఉన్నారు.

'మాయావతిని ప్రధానిని చేయాలి'

గన్నేరువరం, జనవరి 16, బహుజనుల బతుకులు మారాలంటే బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతిని ప్రధానమంత్రి చేయాలని బీఎస్పీ మానకొండూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జి నిషాని రామచంద్రం అన్నారు. బీఎస్పీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మాయావతి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించగా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

నుస్తులాపూర్‌లో ముగిసిన క్రికెట్ పోటీలు

తిమ్మాపూర్, జనవరి16: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న నుస్తులాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న నుస్తులాపూర్ సర్పంచ్ రావుల రమేష్ పాల్గొని విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నుస్తులాపూర్, రామకృష్ణ కాలనీ జట్ల మధ్య జరుగగా, నుస్తులాపూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు 5వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 2500రూపాయల నగదుతో పాటు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్‌ది సిరిస్ పొందిన క్రీడాకారులకు ట్రోఫీలను సర్పంచ్ రావుల రమేష్ అందించారు.

'ప్రభుత్వాన్ని కూలుస్తామంటే తిరుగుబాటు తప్పదు'


మాట్లాడుతున్న ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్

సుభాష్‌నగర్, జనవరి16: తెలంగాణ ప్రభుత్వాన్ని కూలుస్తామంటే తిరుగు బాటు తప్పదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళ వారం నగరంలోని ఫ్రంట్ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల తరు వాత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడడంలో ఆంతర్య మేమిటని ప్రశ్నించారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే కేసీఆర్ సహకరిస్తాడని మాట్లాడుతున్నారా అని అన్నారు. రాష్ట్రంలో ఇపుడు ఏర్పడింది ప్రజా ప్రభుత్వమని, దీన్ని కూల్చాలని చూస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందన్నారు. తెలంగాణలోని అన్ని సామాజిక సంస్థలు యువ కులు, విద్యార్థులు, మేధావులు, న్యాయవాదులు, జర్న లిస్టులు, మహిళలు, రైతులు, కార్మికులు అందరిని ఏకం చేసి మహా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలోని ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు ఒరిజినల్ డిజైన్ మార్చి కాళేశ్వరం అనే కొత్త ప్రాజెక్టు డిజైన్‌తో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో మాజీ సీఎం కేసీఆర్ అవకతవకలకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు. వాటన్నింటిపై సమగ్ర విచారణ జరిగితే అసలు కేసీఆర్ చట్టం నుంచి తప్పించు కోగలుగుతాడా అనేది బండి సంజయ్ చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో బోయినిపల్లి చంద్రయ్య, సిగిరి శ్రీధర్ పాల్గొన్నారు.

'బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలి'

కరీంనగర్ అర్బన్, జనవరి 16 : ఎంపీ బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆయన మంగళవారం డీసీసీ కార్యాలయంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఉద్యమ నేతగా ఎక్కడైనా పోటీ చేసి గెలిచే దమ్మున్న నాయకుడు అని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన బండి సంజయ్ కరీంనగర్ నుంచి కాకుండా వేరే స్థానం నుంచి పోటీ చేసి గెలిసే దమ్ముందా అని ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే హిందూ ద్రోహులమా? గత ఐదు సంవత్సరాలుగా ఎంపీగా నీ పార్లమెంటు పరిధిలో ఉన్న దేవస్థానాలకు ఎన్ని నిధులు తీసుకొచ్చావని బండి సంజయ్‌ని ప్రశ్నించారు. నూతనంగా మంత్రి అయినటువంటి పొన్నం ప్రభాకర్ తిరుమల తిరుపతి దేవస్థానంని సంప్రదించి హుస్నాబాద్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాటుకు నడుం బిగించారన్నారు. పొన్నంను విమర్శిస్తే బుద్ధి చెబుతామన్నారు.

'ఆర్వోబీపై వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి'

కరీంనగర్ టౌన్, జనవరి 16: కరీంనగర్-తీగలగుట్టపల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిపై మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ నిజాలు తెలుసుకొని మాట్లాడాలని ఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆయనకు ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన జీవోలతో కూడిన లేఖను పోస్టు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వ నిధులు లేవని, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కృషితోనే పనులు జరుగుతున్నాయంటూ చేసిన వాఖ్యలు పూర్తి అవాస్తవమని ఖండించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం ఎంపీగా వినోద్‌కుమార్, ఆ తర్వాత ఆ నాటి మంత్రి గంగుల కమలాకర్ కృషిచేయడం వల్లనే బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని అన్నారు. 155 కోట్లతో చేపడుతున్న రైల్వే బ్రిడ్జి నిధుల్లో 28 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాటా, మిగిలిన నిధులు కూడా రాష్ట్రానికి రావలసిన పెట్రోల్ డీజిల్ సెస్ నిధులతోనే నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. జీవోలో ఇందుకు సంబంధించిన వాస్తవాలున్నాయని, వాటి ద్వారా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని బీజేపీ నాయకులకు హరిశంకర్ సూచించారు.

'పొన్నంను విమర్శించే అర్హత ఎంపీకి లేదు'

కరీంనగర్ అర్బన్, జనవరి 16: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే అర్హత బండి సంజయ్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ పొన్నం వల్ల కాంగ్రెస్ నాశనం అవుతుందని బండి సంజయ్ చేసిన వ్యాక్యలు హాస్యాస్ప దమన్నారు. బండి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలియజేశారు. బండి సంజయ్ ప్రవర్తన వల్లే భారతీయ జనతా పార్టీలో నికార్సైన కార్యకర్తలు బీజేపీకి దూరం అవుతున్నారని తెలియజేశారు. ఎంపీగా కరీంనగర్ అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకొచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. బీజేపీలోనే అంతర్గత కుమ్ములాటలను పరిష్కరించుకోలేని బండి కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాజకీయ, సామాజిక పరిజ్ఞానం లేని బండి సంజయ్ కుమార్‌కు మతాల పేరిట యువతను రెచ్చగొట్టి రాజకీయం చేయడం తప్ప ఏమీ తెలియదన్నారు. ఎంపీగా బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మంత్రి పొన్నం గురించి మాట్లాడడం మానుకొని బీజేపీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని బండి సంజయ్‌కి హితవు పలికారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

కరీంనగర్ టౌన్, జనవరి 16: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమ వారం టీపీటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈకార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, రాష్ట్ర కార్య దర్శి మాడుగుల రాములు, జిల్లా బాధ్యులు జె.రాంచంద్రారెడ్డి, శశిధర్, తిరుపతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి

-పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జనవరి16: పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కూలి పోతుందని ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల వెనుక దాగి ఉన్న కుట్రను ఛేదించాలని మంగళవారం జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పురుమల్ల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్‌కు, అలాగే నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్‌ల ఆధ్వర్యంలో నాయకులు టౌన్ ఏసీపీ జి నరేందర్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యల వెనుక ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారని అనుమానాలు ఉన్నందున విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. కుట్రపూరితంగా కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల చేత అక్రమంగా కేసులు పెట్టి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రయత్నం చేయనున్నారా అని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మడుపు మోహన్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిడి రాజిరెడ్డి, కొరివి అరుణ్ కుమార్, తాజొద్దీన్, శ్రవణ్ నాయక్,చర్ల పద్మ, బోనాల శ్రీనివాస్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రెహమాన్ తదితరులున్నారు.

డివిజన్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు


హుజూరాబాద్‌లో రథాన్ని నడుపుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జనవరి 16: సంక్రాంతి వేడుకలను సోమవారం హుజూరాబాద్ డివిజన్‌లోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి పండుగకు మహిళలు ఉదయమే లేచి వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు, నవధాన్యాలు, రేగు పండ్లు, గరిక, పిండిపువ్వులతో ఇంటి ముందు అలంకరించారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని హనుమాన్ దేవస్థానం చుట్టూ సోమవారం రాత్రి ప్రతాపవాడ, ఆరెవాడకు చెందిన ఎడ్లబండ్ల ప్రదక్షిణ నిర్వహించారు. ఈ బండ్లకు దేవతమూర్తుల చిత్రపటాలను ఉంచి వాటి ముందు డప్పుచప్పుళ్లు, వాయిద్యాలతో ఆయా భక్తులకు చెందిన ఇళ్ల నుంచి హనుమాన్ దేవస్థానం వరకు ఊరేగింపుగా చేరుకున్నారు. ఈ రథోత్సవాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తెల్లవారు జామునే వాకిళ్లలో రంగు రంగులతో ముగ్గులు వేశారు. ముగ్గుల మధ్య గొబ్బె మ్మలను పెట్టి, నవధాన్యాలను పోశారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలో సంక్రాంతి వేడుకలు సోమవారం ఘణంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముందు రంగు రంగుల రంగవల్లికలు వేసి గొబ్బెమ్మలను పెట్టారు. చిన్నారులు గాలి పటాలు ఎగుర వేస్తూ సందడి చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందోత్సవాల మధ్య పండగ జరుపుకున్నారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాలు భక్తుల తాకిడితో కిక్కిరిసి పోయాయి.

● హుజూరాబాద్‌రూరల్ : మండల వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పండుగను పురస్కరించుకొని మహిళలు ఉదయాన్నే ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి పండుగను స్వాగతించారు. గ్రామాల్లోని ప్రధాన దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంట్లో పిండి వంటకాలను ఆరేగిస్తూ చిన్న, పెద్ద అనే తేడా లేకుండా పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

● మానకొండూర్: మండలంలోని వివిధ గ్రామాలలో సంక్రాంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, నవధాన్యాలు, గరక తదితర వస్తువులతో వాకిల్లు దర్శనమిచ్చాయి.

● సైదాపూర్: సైదాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ప్రజలు సంక్రాంతి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే యువ తులు, మహిళలు తమ వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంటి ముందు ముగ్గులు వేసి, బొబ్బమ్మలు పెట్టి, నవధాన్యాలు పెట్టారు. అనంతరం పిండి వంటలు చేసుకున్నారు. అదే విధంగా పితృదేవతలకు మొక్కులు సమర్పించుకున్నారు.

● చొప్పదండి: మకర సంక్రాంతి పురస్కరించుకుని చొప్పదండిలోని వైశ్యభవన్‌లో పంచకల్యాణాలు నిర్వహించారు. వాసవి మాత సన్నిధానంలో శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం, రుక్మిణీ కల్యాణం, లక్ష్మినర్సింహస్వామి కల్యాణం, శివపార్వతుల కల్యాణం,సీతారామ కల్యాణాలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు లక్ష పసుపు కొమ్ములు, లక్ష గాజులతో నోములు నిర్వహించారు. సంక్రాంతి పండగను పురష్కరించుకుని మండలంలోని మల్లన్నపల్లిలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు.కొలిమికుంటలో ముగ్గుల పోటీలు నిర్వహించగా ఎంపీపీ చిలుక రవీందర్ హాజరై బహుమతులను అందజేశారు.

ఘనంగా గణపతి హోమం

గంగాధర, జనవరి16: వీరభద్ర స్వామి ఉత్సవాలు మండలంలోని కొట్ల నర్సింహులపల్లెలో వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రుద్ర,నవగ్రహ,గణపతి హోమాలు,విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. ఎండ్ల బండ్లు నాంచారి గుడి చుట్టూ తిరిగాయి. బుధవారం సాయంత్రం జరగనున్న శివకల్యా ణం తిలకించేందుకు వచ్చు భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ తోట కవితా మల్లారెడ్డి తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, జనవరి 16: సైదాపూర్ మోడల్ స్కూల్ ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు సైదాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పర్హాన తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఆరవ తరగతితో పాటు ఏడు నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 7న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆరవ తరగతిలో ప్రవేశానికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది తరగతిలో ప్రవేశాలకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

రెండో విడత దళితబంధు డబ్బులు ఇప్పించాలని వినతి

హుజూరాబాద్, జనవరి 16: రెండో విడత దళితబంధు డబ్బులు ఇప్పించాలని కోరుతూ మంగళవారం లబ్ధిదారులు హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి వొడితెల ప్రణవ్‌కు వినతిపత్రం సమర్పించారు. మొదటి విడతలో రూ.5లక్షలు అప్పటి ప్రభుత్వం ఇవ్వడంతో యూనిట్లు నెలకొల్పామన్నారు. రెండో విడత డబ్బుల కోసం ఎన్నిసార్లు కలెక్టర్ దగ్గరకు వెళ్లిన డబ్బులు ఇవ్వడం లేదని లబ్ధిదారులు ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లారు. అకౌంట్‌లో డబ్బులు ఉన్నా బ్యాంకు వారు ఫ్రీజింగ్ పెట్టారని, వెంటనే తమకు డబ్బులు విడుదలయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరారు. దీనికి స్పందించిన ప్రణవ్ ఈ విషయాన్ని సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



దళితబంధు లబ్ధిదారులతో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

సుభాష్‌నగర్, జనవరి 16: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 107ఏ రీజియన్-1 అకినేపల్లి నాగరాజుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి క్లబ్ గవర్నర్ మాధవి ముఖ్యఅతిథిగా హాజరై భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శివలీల, కార్పొరేటర్ వంగల శ్రీదేవి, నవీన్, వాసవీక్లబ్ సభ్యులు, వైశ్యనాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్ 16: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరుగుతున్న 67వ తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు ఇరువురు ఎంపికయ్యారని పాఠశాల పీఈటీ మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటిన పాఠశాల విద్యార్థులు ఈశ్వర్, హర్షవర్ధన్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మానేరు విద్యాసంస్థల ఛైర్మెన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతరెడ్డి, ప్రిన్సిపాల్ సరితరెడ్డి అభినందించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ రూరల్, జనవరి 16: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలోని మరకతలింగ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామికి ఆజ్యాభిషేకం నిర్వహించారు. అయ్యప్పస్వామికి అభిషేకం, విశేష పంచామృత అభిషేకం, ఆజ్యాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దేవరాజ్ ప్రశాంత్‌శర్మ, గ్రామ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, నందాల తిరుపతి, సాయిని తిరుపతి, జోగినిపల్లి రఘునందన్‌రావు, శ్రీరామోజు తిరుపతి, తుమ్మ ఓం ప్రకాశ్ తోట తిరుపతి, బుర్ర హరీష్‌గౌడ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో దుకాణాల వేలం

కరీంనగర్ రూరల్, జనవరి 16: నగరంలోని సమీకృత మార్కెట్ (ఇంటిగ్రేటెడ్ మార్కెట్) వీక్లీ మార్కెట్ ఏరియాలో గల నాలుగు దుకాణాలను వేలం వేయనున్నట్ల అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో ఎక్కువ అద్దె చెల్లించే వారికి నాలుగు దుకాణాలు కేటాయిస్తామన్నారు. దుకాణాల కేటాయింపునకు రిజర్వేషన్ పాటించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు రుసుము 300 చెల్లించి ఫారములు పొందాలన్నారు. ఈనెల 17 తేదీ నుంచి 19 వరకు దరఖాస్తులు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా మార్కెటింగ్ అధికారి కరీంనగర్ గారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ రూరల్: అయోధ్యలో రామమందిరం నిర్మించిన సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన ఆర్టిస్ట్ శ్రీనివాస్ గ్రామంలోని ప్రతి ఇంటి గోడలపై జైశ్రీరాం రాసి భక్తిభావం చాటుతున్నాడు. శ్రీనివాస్ అయోధ్యలో రామమందిరం నిర్మాణమై, పునఃప్రతిష్ట కార్యక్రమం ఈనెల 22న ఉన్నందున దుర్శేడ్ గ్రామంలోని ప్రతి ఇంటి గోడపై జైశ్రీరామ్ అని సొంత ఖర్చులతో రాస్తున్నాడు. శ్రీనివాస్‌ను ఉపసర్పంచ్ సంపత్‌రావు, బోగ రాజ్‌కుమార్, శ్రీనివాస్, సాయిల లక్ష్మణ్‌లు అభినందించారు.

●భగత్‌నగర్: గుంటూరు కారం సినిమాలో విలన్స్‌కు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం హేయమైన చర్య అని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భువనగిరి మహేందర్, బామండ్లపల్లి యుగేందర్‌లు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్‌కు మతి భ్రమించిందని ధ్వజమెత్తారు.

●భగత్‌నగర్: కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నాడే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొనుగోలు చేశాడని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాగ్రత్తగా ఉండాలని మాత్రమే ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారన్నారు.

●కరీంనగర్ కల్చరల్: కేరళ అయ్యప్ప సన్నిధానంలో జరిగే మకరవిళక్కు దర్శనాన్ని సోమవారం రాత్రి భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్‌లోని అయ్యప్ప ఆలయంలో భారీ స్క్రీన్ల ద్వారా అయ్యప్ప భక్తులు, దీక్షాపరులు వీక్షించి తన్మయత్వం చెందారు. కార్యక్రమంలో ఈఓ కొన్న కాంతారెడ్డి పాల్గొన్నారు.

● జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని ప్రాథమి క వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో 2024క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యతిధిగా మున్సిప ల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి, కార్యనిర్వాహణ అధికారి వొజ్జ రవీందర్ పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: దళితబంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండాయని టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఇల్లందకుంటలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఒక్కో కుటుంబానికి రూ. 10లక్షలు ఇవ్వాలనే సంకల్పంతో దళితబంధు పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టారన్నారు.

● జమ్మికుంట: జమ్మికుంట పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ పొనగంటి శంకర్ సోమవారం గుండెపోటుతో మృత్యువాత పడ్డా డు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ హుటాహుటిన ఆయన నివాసం వద్దకు వెళ్లి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించారు.

● జమ్మికుంట: మేదరి సంఘం జిల్లా అధ్యక్షులు మధుర రవీందర్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేతుల మీదుగా మంగళవారం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఏకుల రాజనర్సు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వలపరెడ్డి లచ్చయ్య, రాష్ట్ర సహాయక కార్యదర్శి సిలివేరు సత్యనారాయణ, ఏకుల రమేష్ పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు జరిగాయి. ముగ్గుల పోటీ ల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన గిసా శిరిష రశలికి రూ. 5,016 నగదును సర్పంచ్ కోడిగూటి శారద ప్రవీన్ అందజేశారు.

● వీణవంక: మండల కేంద్రంతో పాటు హిమ్మత్‌నగర్,శ్రీరాముల పేట గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ ఇంచా ర్జీ వొడితల ప్రణవ్ పరామర్శించారు. వీణవంక గ్రామా నికి చెందిన పాత్రికేయుడు పత్తి కొండల్‌రెడ్డి అనారో గ్యంతో బాధపడుతుండగా పరమర్శించి వివరాలు తెలుసుకున్నారు.హిమ్మత్‌నగర్,శ్రీరాముల పేట గ్రామాల్లోమృతి చెందిన వారి కుటుంబాలను పరమర్శించారు.

● మానకొండూర్: మానకొండూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుతులను జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ పంపిణీ చేశారు.

● హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని జూపాక గ్రామంలో బీఎస్పీ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ జి.కుమారి మాయవతి 68వ జన్మదిన వేడుకలను బీఎ స్పీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. నాయకులు దొడ్డ సమ్మయ్య, మేకల రవీందర్, మారేపల్లి మొగిల య్య, పల్లె ప్రశాంత్‌గౌడ్, రామస్వామి ఉన్నారు.

● గంగాధర: గంగాధర మండలం మల్లాపూర్‌కు చెందిన నాగని రాధ(28) గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమిత మైంది. బాధితురాలికి తూడి లచ్చయ్య యువసేన ద్వారా 10వేల ఆర్థిక సహాయం అందించారు.